నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 17 జూన్ 2025 | NIZAMABAD



జడ్జీని కలిసిన కలెక్టర్

నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వినయ్ కృష్ణారెడ్డి..జిల్లా న్యాయమూర్తి జీవీఎన్.భరతలక్ష్మిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి చాంబర్‌లో ఆమెకు పూలమొక్కను అందజేశారు. జిల్లా స్థితిగతులతోపాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు.

–కంఠేశ్వర్, జూన్ 16



- ఏడాదిగా ఎలక్షన్లు పెట్టని ప్రభుత్వం
- స్థానిక సమరంపై మంత్రుల ప్రకటనలు
- పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్న ఆశావాహులు
- రిజర్వేషన్ కొనసాగింపుపై స్పష్టత కరువు


# పల్లె పోరు.. తెగని తకరారు!

## 'స్థానిక' ఎన్నికలపై ఎడతెగని ఉత్కంఠ

నిజామాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. పల్లె పోరుకు ఎప్పుడు తెర లేస్తుందన్న దానిపై గ్రామాల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్న తరుణంలో ఎలక్షన్లు పెట్టకుండా ప్రభు త్వం కాలయాపన చేసుకుంటూ వస్తున్నది. ఏడాది కాలంగా ప్రత్యేకాధికారుల పాలనతో నెట్టుకొస్తున్నది. అయితే, తాజాగా కొందరు మంత్రులు చేస్తున్న ప్రకటనలతో ఆశావాహుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది. ఈ నెలాఖరులో స్థాని క సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయను న్నట్లు మంత్రులు ప్రకటించడంతో పల్లెల్లో 'స్థానిక' సందడి మరోసారి పెరిగింది.

**వ్యతిరేకతతో భయపడి..**

అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయలేక 'చేతు'లెత్తేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే జనాల్లో అసహనం వెల్లువెత్తడంతో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు వెనుకడుగు వేసింది. పల్లె పోరులో పరాభవం తప్పదనే భయం తో ఎలక్షన్లు నిర్వహించకుండా స్పెషలాఫీసర్లతో నెట్టుకొస్తున్నది. ఫలితంగా గ్రామా ల్లో పరిపాలన స్తంభించింది. మరోవైపు, ఎన్నికలు నిర్వహించక పోవడంతో రేవంత్ సర్కారుపై ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పాలకవర్గాలను ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాగ్రహాన్ని గమనించిన ప్రభుత్వం స్థానిక పోరుకు సన్నద్ధమైంది. ఇప్పటికే మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లీకులు ఇవ్వడంతో స్థానిక పోరు ఖాయమైనట్లుగానే ప్రచారం జరుగుతున్నది.



**రిజర్వేషన్లపై ఉత్కంఠ..**

కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లపై తెచ్చిన చట్టం ప్రకారం పదేళ్లపాటు రిజర్వేషన్లు అమలులో ఉంచుకోవచ్చు. దీని ప్రకారం మరో ఐదేళ్లు పాత రిజర్వేషన్లు కొనసాగించే అవకాశం ఉంది. కానీ కాంగ్రెస్ సర్కారు కొత్త విధానానికి మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త విధానానికి మొగ్గు చూపితే ఎన్నికలు మరింత ఆలస్యం కావొచ్చని అధికారులు చెబుతున్నారు.

**సిద్ధంగా యంత్రాంగం..**

నిజామాబాద్ జిల్లాలో 27 జడ్పీటీసీ, 299 ఎంపీటీసీ, 530 సర్పంచ్ స్థానాలుండగా, కామారెడ్డి జిల్లాలో 22 జడ్పీటీసీ, 236 ఎంపీటీసీ, 536 సర్పంచ్ స్థానాలున్నాయి. అధికారులంతా పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాల మార్పుచేర్పు ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు పోలింగ్ నిర్వాహణకు రెడీగా ఉన్నారు. అయితే, ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు వార్తలు వస్తుండడంతో ఆశావాహుల్లో రిజర్వేషన్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. రిజర్వేషన్ల అమలుపైనా గ్రామాల్లో జోరుగా చర్చ నడుస్తున్నది. పాత రిజర్వేషన్లు కొనసాగిస్తారా.. లేక కొత్తవి ప్రకటిస్తారా? అన్నది చర్చనీయాంశమైంది. ఇదే పరిస్థితి పురపాలక సంఘాల్లోనూ కనిపిస్తున్నది. ప్రజా ధనాన్ని వినియోగించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అధికార పార్టీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు చుట్టూ తిరుగుతూ నిధులు మంజూరు చేయించుకుని పల్లెల్లో ఇప్పటికే రహదారులు, ఇతర పనులను చేయిస్తున్న పరిస్థితి ఉంది. మరోవైపు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న కుటుంబాలను పరామర్శిస్తున్నారు. వారికి సీఎంఆర్ఎఫ్ నిదులు ఇప్పించి, తద్వారా ఓట్లు దండుకోవాలనే ఆలోచనతో అడుగులు వేస్తున్నారు.

**కాంగ్రెస్‌పై వ్యతిరేకత..**

18 నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులైతే గుడ్డిగా రేవంత్ మాటలను, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను నమ్మి మోసపోయామంటూ నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. రైతుభరోసా, రుణమాఫీ, బోనస్ డబ్బులు రాక తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. మహిళలందరికీ రూ.2500 చొప్పున పింఛన్ చేస్తామన్న కాంగ్రెస్ ఆ హామీని నిలబెట్టుకోలేదు. సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచుతామన్న హామీని సైతం అమలు చేయలేదు. ఇలా ఎన్నో హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో భారీ వ్యతిరేకత కనిపిస్తున్నది. ఈ గడ్డు కాలంలో ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ గుర్తుపై నిలబడే ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ప్రజల నుంచి నిరసన సెగ తగలడం ఖాయమన్న చర్చ జరుగుతున్నది. పదేళ్ల పాటు సంక్షేమ పాలన అందించిన బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపే అవకాశముందన్న భావన వ్యక్తమవుతున్నది.

- కాళేశ్వరంపై విచారణ కాంగ్రెస్ కుట్ర
- ఫార్ములా ఈ రేస్.. ఒక బేఖారు కేసు
- కేసీఆర్, కేటీఆర్ కడిగిన ముత్యంలా ప్రజాక్షేత్రంలో నిలుస్తారు
- ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలుచేసేవరకూ పోరాడుతాం..
- బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

# అక్రమ కేసులతో బీఆర్ఎస్‌ను అడ్డుకోలేరు



ఖలీల్‌వాడి, జూన్ 16 : అక్రమ కేసులతో బీఆర్ఎస్ పార్టీని అడ్డుకోలేరని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఫార్ములా ఈ కారు రేసింగ్ అక్రమ కేసులో మరోసారి ఏసీబీ విచారణకు పిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపునకు పరాకాష్ట అని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కారు అక్రమ పాలనను ఎండగడుతూ ప్రజల పక్షాన గళమెత్తుతున్న కేటీఆర్ పై ఇంత కక్ష సాధింపా? అని ప్రశ్నించారు. ఎలాంటి అక్రమాలు జరగని కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం కక్కుతూ తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను నిన్న, హైదరాబాద్ ఇమేజ్ పెంచడం కోసం చేపట్టిన ఫార్ములా ఈ కారు రేసింగ్‌లో ఏదో జరిగిందని ఆధారాలు లేని అభియోగాలతో నేడు కేటీఆర్‌ను విచారణల పేరుతో వేధించడం తెలంగాణ ఆత్మగౌరవానికి మాయని మచ్చ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై సీఎం రేవంత్ రెడ్డి కత్తి పెట్టి హింసిస్తూ ఇందిరమ్మ రాజ్యం అంటేనే అప్రకటిత ఎమర్జెన్సీ అని చాటుతున్నారని మండిపడ్డారు. మరో వంద అక్రమ కేసులు పెట్టుకున్నా తలవంచబోమని, అరెస్టుల మీద అరెస్టులు చేసుకున్నా భయపడబోమని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై విచారణ కాంగ్రెస్ కుట్ర అని, ఫార్ములా ఈ రేస్ ఒక బేఖారు కేసని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ లు కడిగిన ముత్యంలా ప్రజాక్షేత్రంలో నిలుస్తారని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కేటీఆర్‌ను మిస్టర్ క్లీన్‌గా ఆయన అభివర్ణించారు. కేటీఆర్ అరపైసా అవినీతికి పాల్పడలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్ పై ఏదో రకంగా బురదజల్లి తాత్కాలిక ప్రయోజనం పొందాలని చూస్తున్నదని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. ఇలాంటి ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రశ్నిస్తూనే ఉంటామని, సర్కార్ దాష్టీకాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి కుట్రల నుంచి కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడేదాకా పోరాటం చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

## సెకండియర్‌లో 57.46 శాతం ఉత్తీర్ణత

ఖలీల్‌వాడి, జూన్ 16 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలవగా నిజామాబాద్ జిల్లాలో 57.46 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. సెకండియర్ (జనరల్)లో మొత్తం 6,497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 3733 మంది ఉత్తీర్ణత (57.46 శాతం) సాధించారని పేర్కొన్నారు. వొకేషనల్‌లో మొత్తం 899 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 503 మంది ఉత్తీర్ణులయ్యారని (55 శాతం) తెలిపారు. మొదటి సంవత్సరం (జనరల్) 10,098 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 5,851 మంది పాసయ్యారని (58 శాతం ఉత్తీర్ణత) తెలిపారు. వొకేషనల్ మొదటి సంవత్సరంలో 1420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 903 మంది పాసైనట్లు (63.59 శాతం) పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 20వ స్థానంలో, మొదటి సంవత్సరం ఫలితాల్లో 26 వ స్థానంలో నిలిచిందని వివరించారు. రీవాల్యుయేషన్, వెరిఫికేషన్ చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈనెల 17 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

కలెక్టరేట్ ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన

# బీబీపేట బాలికల పాఠశాలను తరలించొద్దు..

కామారెడ్డి, జూన్ 16 : బీబీపేట్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను బాలుర ఉన్నత పాఠశాలకు తరలించవద్దని కోరుతూ విద్యార్థినులు తల్లిదండ్రులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల నుంచి బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తూ వస్తున్నదని, ప్రస్తుతం బాలికల ఉన్నతపాఠశాలను బాలుర పాఠశాలకు మార్చాలని డీఈవో ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. బాలుర పాఠశాలలోకి మార్చితే బాలికల విద్యతోపాటు భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. బాలికలకు ప్రత్యేకంగా పాఠశాల ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాల తరలింపుతో అనేక మంది బాలికలు విద్యను కొనసాగించడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, కలెక్టర్ చొరవ తీసుకొని బాలికల పాఠశాలను యథావిధిగా అక్కడే కొనసాగించాలని కోరారు.



కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

# 'డబుల్' ఇండ్ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

## కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట లబ్ధిదారుల ధర్నా

కోటగిరి, జూన్ 16: ఇండ్ల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులు కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ మాట్లాడుతూ.. సొంతింటి కల నెరవేర్చాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లులేని ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేసిందని తెలిపారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల బిల్లులు చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. కోటగిరిలో 150 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల బిల్లులు రావాల్సి ఉన్నదని, కానీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిల్లుల కోసం దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శంకర్, తిరుపతి, గంగారాం, మక్కయ్య, నజీర్, సాయిలు, గఫూర్, సాయవ్వ పాల్గొన్నారు.



# ఖాళీ కుర్చీలు.. కానరాని రైతులు

- 'రైతునేస్తం' ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకాని అన్నదాతలు
- వెలవెలబోయిన వీడియో కాన్ఫరెన్స్
- సీఎం మాట్లాడే సమయంలో మీసన్‌పల్లి రైతువేదిక ఖాళీ

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 16: రాష్ట్రప్రభుత్వం సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించగా..ఎల్లారెడ్డి మండలం మీసన్‌పల్లి గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ వెలవెలబోయింది. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే సమయంలో రైతులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. రాష్ట్రంలోని 1031 రైతు వేదికలకు కొత్తగా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పిస్తూ, ప్రతి మంగళవారం 10 నుంచి 12 గంటల వరకు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో లైవ్ ప్రోగ్రాం నిర్వహించడానికి సిద్ధం చేశారు. రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉన్న మండలంలోని మీసన్‌పల్లి రైతువేదికలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడే సమయంలో రైతువేదికలో ముగ్గురు అధికారులు, ముగ్గురు రైతులు మాత్రమే ఉండగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. రైతులు లేకుండా చేపట్టిన కార్యక్రమం అభాసుపాలైనట్లు పలువురు మాట్లాడుకోవడం వినిపించింది.



# పారిశుద్ధ్య కార్మికుల శ్రమ దోపిడీ

- వారి ఆరోగ్యంపై పట్టింపేదీ?

పారిశుద్ధ్య కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలకంగా వ్యవహరించే కార్మికుల శ్రమను దోచుకుంటున్నది. నిజామాబాద్ నగరంలో చెత్త సేకరించే కార్మికులకు మాస్క్, గ్లౌజ్‌లు, షూ విధిగా ఇవ్వాలి. కానీ ఇవేమీ ఇవ్వకపోవడంతో కార్మికులు వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి చెత్త సేకరిస్తున్నారు. వానకాలం కావడంతో మురికి కాలువలు, రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తున్నది. కొన్ని చోట్ల దోమలు వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్మికులు రోగాల బారిన పడకుండా కనీసం మెడికల్ కిట్లు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చెత్తను తరలిస్తున్న కార్మికులు

## ధర్మారంలో దారుణం..

# తండ్రిని చంపిన తనయ



పల్లపు నర్సయ్య (ఫైల్)

నవీపేట,జూన్ 16: మండలంలోని ధర్మారం గ్రామంలో సోమవారం దారుణం చోటుచేసుకున్నది. ఇతర స్త్రీలతో తండ్రి వివాహేతర సంబంధం పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేని ఓ కూతురు రోకలిదుడ్డుతో కొట్టి హత్య చేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య(54), నర్సవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరి పెండ్లిలు చేయగా.. పెద్ద కూతురు భర్త మృతి చెందడంతో ఆమె ఇంటి వద్దనే ఉంటున్నది. చిన్న కూతురు వర్షితను నిజామాబాద్ మండలం కొత్తపేటకు ఇవ్వగా భర్తతో గొడవ కారణంగా కొంత కాలంగా పుట్టింటి వద్దనే పిల్లలతో కలిసి ఉంటున్నది. తండ్రి నర్సయ్య కొంతకాలంగా పరాయి స్త్రీలతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనిపై వారం రోజుల క్రితం నర్సయ్యతో పెద్ద కూతురు, భార్య నర్సవ్వ ఘర్షణ పడగా వారు నిజామాబాద్ వెళ్లి అక్కడే ఉంటున్నారు. కుటుంబంలో నిత్యం ఘర్షణలు చోటుచేసుకోవడంతో చిన్నకూతురు భరించలేకపోయింది. సోమవారం మద్యం తాగి ఇంట్లో నిద్రిస్తున్న తండ్రిపై రోకలి దుడ్డుతో తలపై బలంగా కొట్టి చంపేసింది. విషయం తెలుసుకున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. నర్సయ్యను తన కూతురే రోకలి దుడ్డుతో దారుణంగా హత్యచేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.